క్లుప్తంగా

కొండలమ్మను దర్శించుకున్న జిల్లా జడ్జి



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మ వారిని కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక సోమవారం దర్శించుకున్నారు. అలాగే కృష్ణాజిల్లా రిజిస్ట్రార్ వి.వి.ఎస్.ఆర్.ప్రసాద్ అమ్మవారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు సన్మానించి అమ్మవారి చిత్రపటాలతో పాటు లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

పరిపాలనా విధానంపై అవగాహన ఉండాలి

పామర్రు: పరిపాలనా విధానంపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్గి ఉండాలని మండల విస్తరణాధికారి(ఈఓపీఆర్డీ) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు నాలుగు రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. పామర్రు ఉపసర్పంచ్ దేవిరెడ్డి బాలవెంకటేశ్వరరెడ్డి, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



పమిడిముక్కల: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తామని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. స్థానిక సచివాలయం వద్ద సోమవారం ఎమ్మెల్యే ప్రజావేదిక నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు. పలువురు మహిళలు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు కావాలని వినతిపత్రాలు అందజేశారు. త్వరలో అర్హులకు ఇళ్లస్థలాలు ఇచ్చేలా పాలసీ సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీడీఓ విఠల్‌పాల్, తహసీల్దార్ నవీన్‌కుమార్, సర్పంచ్ ముళ్లపూడి సునీత, టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టంపై అవగాహన కోసం సదస్సులు

మండవల్లి: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహించాలని ఐక్యవేదిక కోరింది. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీకోసం కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌కు ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 12న సమాచార హక్కు చట్టం -2005 వార్షికోత్సవం నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



గుడివాడ టౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు స్వీకరించిన మిద్దె శ్రీనివాసరావును సోమవారం ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆఓపా) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆఓపా సభ్యుడిగా శ్రీనివాసరావు ఉంటూ జాతీయ ఉత్తమ అవార్డు పొందడం అసోసియేషన్‌కే గర్వకారణమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీనివాస్, కార్యదర్శి వై. శ్రీనివాసరావు, కోశాధికారి వి.కిరణ్ కుమార్, డి. రాధాకృష్ణ పాల్గొన్నారు.

9న నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరించిన కృష్ణా జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు ప్రసాద్‌రావు

పామర్రు: విజయవాడలో ఈ నెల 9వ తేదీన ధర్నా చౌక్ వద్ద జరిగే కుల జన గణన మహాధర్నాను విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పెగ్గం ప్రసాద్‌రావు కోరారు. స్థానిక ఇందిరానగర్‌లోకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాధర్నా కార్యక్రమం కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో కుల గణన నిర్వహించి, బీసీల జనాభాను బట్టి పార్లమెంట్, అసెంబ్లీ సీట్లు రిజర్వు చేయాలన్నారు.

మద్యం కిక్కు.. ఎవరిదో లక్కు

- పామర్రు నియోజకవర్గానికి 17 మద్యం దుకాణాల కేటాయింపు
- షాపుల టెండర్ల కోసం పోటా పోటీ
- రాజకీయ దళారుల రంగ ప్రవేశం



మద్యం దుకాణం

పామర్రు: మందు ప్రియులను మత్తులో ముంచి అందిన కాడికి దోచుకునేందుకు అధికారికంగా రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు ప్రభుత్వ పర్యవేక్షణలో అక్రమాలకు తావులేకుండా సాగిన మద్యం వ్యాపారం ఇకపై ప్రైవేటు వ్యక్తుల దందాలకు వేదికగా మారనుంది. పామర్రు నియోజకవర్గానికి 17 మద్యం షాపులు కేటాయిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. పామర్రు పట్టణంలో 4, మొవ్వ మండల పరిధిలో 5, పెదపారుపూడిలో 2, పమిడిముక్కలలో 3, తోట్లవల్లూరులో 3 ఏర్పాటు చేస్తారు. టెండర్లలో పాల్గొనే వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఒక్కొక్క దరఖాస్తుకు రూ.2లక్షలు (నాన్ రీఫండ్) చెల్లించాలి. ఏడాదికి రూ.65 లక్షలు, అటు తర్వాత ఏడాది రూ.71,50,000 ప్రభుత్వానికి చెల్లించాలి.

రంగంలోకి రాజకీయ పైరవీదారులు

రాజకీయ పార్టీ నేతలకు ఆదాయ వనరైన మద్యం షాపులను దక్కించుకునేందుకు రాజకీయ పైరవీదారులు రంగ ప్రవేశం చేశారు. అధికార పార్టీకి చెందిన ఒక ప్రముఖ నాయకుడు మద్యం షాపుల కోసం తన అనుచరులతో దరఖాస్తులు వేయించి ఇక ఎవరినీ వేయకుండా చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. నేతల పేర్లు చెప్పుకుంటూ వివిధ పార్టీల చోటా నాయకులు షాపులు తమవేనన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రియల్ రంగంలో కోట్లు వెనకేసుకున్న రియల్టర్లు కూడా మద్యం షాపుల కోసం పావులు కదుపుతున్నారు. పామర్రు మద్యం షాపులకు కిక్కు ఎక్కువే పామర్రు నియోజకవర్గంలో మద్యం షాపులకు డిమాండ్ అధికంగానే ఉంటుంది. మద్యం షాపులను సిండికేట్‌గా మార్చి భారీ స్థాయిలో ప్రజల సొమ్మును దోచుకున్న వ్యాపారులపై గతంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదయ్యాయి. మద్యం వ్యాపారులకు అండగా నిలిచే క్రమంలో కొందరిపై కేసులు నమోదు అయ్యాయి. పామర్రు నియోజకవర్గంలో 17 షాపులకు పోటీ తీవ్రంగా ఉంది. ఒకొక్క షాపునకు 10 నుంచి 12 మందికి పైగా పోటీ పడే అవకాశం ఉందని ఎక్సైజ్‌శాఖలో చర్చ నడుస్తోంది. లాటరీ పద్ధతిలో ఎంపిక చేసే డిప్‌లో లక్కు ఎవరిదో మద్యం కిక్కు ఏపాటితో తెలియనుంది. విజయదశమి రోజు లక్కీ డ్రా విజేతలు నూతన మద్యం షాపులకు శ్రీకారం చుట్టనున్నారు.

ఎవరైనా పాల్గొనొచ్చు

మద్యం షాపులను మంజూరు చేస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దుకాణాలను దక్కించుకోవాలనుకునే వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. మద్యం షాపులకు ఎక్కువ మంది పోటీ పడే అవకాశం ఉంది. లాటరీ పద్ధతిలో నిర్వాహకులను ఎంపిక చేస్తారు.

– పీ లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ సీఐ

కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలి



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: ఇటీవల వచ్చిన వరదల కారణంగా దెబ్బతిన్న కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించే వరకు పోరాడతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో కౌలు రైతు సమస్యల పరిష్కారం బ్రోచర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. దీనిపై పోరాడేందుకు తదుపరి చర్యల కోసం ఈ నెల 8వ తేదీ విజయవాడ మాకినేని బసవ పున్నయ్య భవనంలో ముఖ్య నేతలతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కావున రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వివరించాలన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు ఎస్. ఉమామహేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, యెషయ్య తపాల్గొన్నారు.

సీసీ కెమెరా 10 మంది పోలీసులతో సమానం



నియోజకవర్గ స్థాయి గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న సీఐ రవికుమార్

కైకలూరు: దొంగతనాలు, నేర ఘటనల పరిశీలనలో ఒక్కో సీసీ కెమెరా 10 మంది పోలీసు సిబ్బందితో సమానమని కై కలూరు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో 40 మంది గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సోమవారం కైకలూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఉన్నాయి.. వాటి పనితీరు ఏమిటి అనే విషయాలను గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మహిళా కార్యదర్శులు సీసీ కెమెరాల ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దసరా, దీపావళి సెలవులకు సొంత ఊళ్లకు వెళ్లే కుటుంబాల వివరాలు తెలుసుకుని పోలీస్‌స్టేషన్‌లో అధికారులకు తెలియజేయాలన్నారు. పండగ రోజుల్లో అసాంఘిక కార్యకలాపాలు, అశ్లీల నృత్యాల సమాచారాన్ని పోలీస్‌స్టేషన్ అధికారికి చెప్పాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత మహిళా సంరక్షణ కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో కైకలూరు రూరల్ ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య

ఎలకుర్రు(పామర్రు): ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం మానసిక ఆరోగ్య చట్టం ఉందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మచిలీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య పేర్కొన్నారు. మండలంలోని ఎలకుర్రులోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టులో మానసిక ఆరోగ్య చట్టంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్జి విచ్చేసి మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల గురించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కమిటీ ఉందన్నారు. ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు తాత్కాలిక సదాన్ సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. వీటితో ఆ పిల్లలకు చెందాల్సిన ప్రభుత్వ సౌకర్యాలు పొందలేక పోతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి తాత్కాలిక సర్టిఫికెట్ల స్థానంలో శాశ్వత సర్టిఫికెట్లు ఇచ్చేవిధంగా ప్రభుత్వం జీఓ విడుదల చేయాలని కోరారు. ఆర్ పీ డబ్ల్యూడీ యాక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు సంవత్సరాలకే పరిమితం చేసిందని, దీనిని ఐదేళ్ల వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ న్యాయవాది అజ్మతీఉ న్నీసా పాల్గొన్నారు.

మహిళలు హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

మొవ్వ: మహిళలు తమ హక్కులను సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందాలని కృష్ణా జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో 'విధాన్ సే సమాధాన్' కార్యక్రమంలో భాగంగా జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో సోమవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో నైతిక విలువలను ప్రతిఒక్కరూ పాటిస్తూ వారి పిల్లలకు కూడా నైతిక విలువలపై అవగాహన కలిగించాలన్నారు. వరకట్న నిషేధ చట్టం, గృహహింసా నిరోధక చట్టం, ర్యాగింగ్ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. మొవ్వ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్‌గా ఉన్న మొవ్వ కోర్టు న్యాయమూర్తి పి.రాజన్ ఉదయ్ ప్రకాష్, రిసోర్స్ మెంబర్స్ గొరిపర్తి శ్రీనివాసరావు, సరస్వతి పాల్గొన్నారు.

వరిపైరుకు ఎలుకల బెడద



వరిపైరు (ఫైల్)

గుడివాడరూరల్: ఖరీఫ్ సీజన్‌లో ఎలుకల బెడద రైతులకు నిద్రలేకుండా చేస్తోంది. ఎలుకలు వరిపైరును కొరికేసి అపారంగా నష్టపరుస్తున్నాయి. దుబ్బుదశలో ఉన్న వరిపైరుపై ఎలుకలు దాడి చేసి పైరుకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఎలుకలను నిర్మూలించుకునే చర్యలు చేపట్టకపోతే పంటలో 10 నుంచి 40 శాతం దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు. ఎలుకల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను ఇప్పటి నుంచే గ్రామాల్లో రైతులకు తెలియపరుస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ మండలంలో 14,675 ఎకరాలు, గుడ్లవల్లేరు మండలంలో 22,493 వేల ఎకరాలు, నందివాడ మండలంలో 4262 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 1318, 1061, 5204, 2231, పిఎల్ఏ 1100 రకాల విత్తనాలను రైతులు సాగుకు వినియోగించారు. తొలకరిలో వేసిన నాట్లు ప్రస్తుతం చిరుపొట్ట దశకు చేరుకున్నాయి.

పైరుపై ఎలుకల దాడి

ఈ సార్వా సీజన్‌లో వరిపైరుపై ఎలుకల దాడి అధికంగా కన్పిస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. దుబ్బులు కత్తిరించేసి పైరును ఎలుకలు చిందరవందరగా చేస్తున్నాయి. పొట్టదశలో ఉన్న దుబ్బులను పాడు చేస్తున్నాయి. దుబ్బులు పాడు కావడంతో వరికంకులు రాలిపోతున్నాయి.

సాగు పద్ధతులు ఇలా..

సాగు ప్రారంభించే ముందు సాగు పద్ధతిలో కొన్ని పద్ధతులను అవలంబిస్తే ఎలుకల నివారణ తేలిక అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

- దమ్ముకు ముందు గట్లను చెక్కి వాటి పరిమాణాన్ని తగ్గించుకోవాలి.
- గట్లపై కలుపు మొక్కలు తొలగించాలి.
- పైరులో ప్రతి 8, 12 అడుగులకు బాటలు తీసుకోవాలి.
- పొలాల్లో ఎలుకల బోనులు, బుట్టలు ఉపయోగించి పైరును కాపాడుకోవాలి.

సామూహికంగా నిర్మూలన చేపట్టాలి

వరిపైరును ఎలుకల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన పద్ధతులు అనుసరించాలి. రైతులు తమ పొలానికి పరిమితమైన ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా ప్రయోజనం ఉండదు. వ్యవసాయశాఖ నూరు శాతం రాయితీపై ఎలుకల నిర్మూలనకు బ్రొమోడయోలోన్ మందును రైతులకు అందిస్తుంది.



ఎలుకల నిర్మూలనకు సబ్సిడీపై ఇస్తున్న మందు

నివారణ ఇలా..

ఎకరాకు 10 గ్రాముల చొప్పున బ్రొమోడయోలోన్ మందు వాడుకోవాలి. విషపు ఎర తయారీకి 10 గ్రాముల బ్రొమోడయోలోన్ మందు, అరకిలో నూకలు, పావులీటరు మంచినూనె కలిపి ఒక్కొక్క ఎలుక బొరియా వద్ద కలిపిన మందు మిశ్రమాన్ని పేపర్ పొట్లాలుగా కలిపి ఉంచాలి. ఈ విధంగా చేయడం వలన ఎలుకలను నిర్మూలించుకోవచ్చు. ఇందుకు గాను మొదటిరోజు పొలంలో ఉన్న బొరియలు గుర్తించి మట్టితో కప్పివేయాలి. రెండో రోజు తెరిచి ఉన్న బొరియలను ఎలుకలు ఉన్న బొరియలుగా నిర్ధారించుకోవాలి. తయారు చేసిన విషపు ఎర్రను బొరియల్లో వేసి మూసి వేయాలి. 10వ రోజు తెరుచుకున్న బొరియలను గుర్తించి మళ్లీ విషపు ఎర్ర వాడాలి. ఈ విధంగా చేయడం వలన ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం



ఎలుకల నిర్మూలనకు రైతులకు మందును తయారు చేసుకునేందుకు ప్రభుత్వం నూరుశాతం రాయితీపై అందిస్తోంది. గ్రామాల్లో ఆర్‌బీకేల ద్వారా రైతులకు ఎలుకల నిర్మూలన చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు ఏదైనా సందేహాలు ఉంటే వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ద్వారా తెలుసుకుని ఎలుకలను నిర్మూలించుకోవాలి.

– బి.అనంతలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి

గ్రామాల అభివృద్ధిపై ఓఎన్‌జీసీకి వినతి

కైకలూరు: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) సాయాన్ని కొల్లేరు గ్రామాల అభివృద్ధికి కేటాయించాలని కోరుతూ రాజమండ్రిలో ఓఎన్‌జీసీ అసిస్టెంట్ మేనేజర్ రామారావుకు సోమవారం వినతిపత్రాన్ని అందజేసినట్టు రాష్ట్ర వడ్డి సామాజికవర్గ సాధికారిక కన్వీనర్ భలే ఏసురాజు తెలిపారు. కైకలూరులో ఆయన విలేకరులతో మాటాడుతూ గతంలో ఓఎన్‌జీసీ సాయాన్ని కోరగా.. అంచనాలతో రావాలని చెప్పారన్నారు. దీంతో తాగునీటి ట్యాంకుల నిర్మాణం మరమ్మతుల కోసం కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద రూ.51 లక్షలు, పెంచికలమర్రు గ్రామానికి రూ.59 లక్షలు, మండవల్లి మండలం ఇంగిలిపాకలంకలో తాగునీటి ట్యాంకు మరమ్మతులకు రూ.10 లక్షల అంచనాలతో నివేదికలు అందించినట్టు తెలిపారు. కొల్లేరు నాయకులు జయమంగళ సుబ్బారాజు, సైదు గాంధీ, గంగరాజు పాల్గొన్నారు.

కరుణించమ్మా మహాచండీదేవీ



తోట్లవల్లూరులో శ్రీమహాచండీదేవిగా అమ్మవారు



తటివర్రు రోడ్డులో శ్రీరాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు



పామర్రులో మంగళగౌరిగా పర్వత వర్ధనీదేవి



మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవిగా..

ఘనంగా దేవీ శరన్నవరాత్రులు

తోట్లవల్లూరు: దేవీ శరన్నవరాత్రులు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుగుతున్నాయి. తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారు సోమవారం శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కురుణించమ్మా.. దీవించమ్మా అని వేడుకున్నారు. ఆలయ ఈఓ హరి దుర్గా నాగేశ్వరరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కాశీ అన్నపూర్ణాదేవీ పాహిమాం

కైకలూరు: కైకలూరు శ్యామలాంబ తల్లి కాశీ అన్నపూర్ణాదేవీ అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాట ప్రదర్శన, హరికథా గానం, రాత్రి బాలనాగమ్మ పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రుల్లో అమ్మవారికి చామంతి పూజ, లలితా నామ సహస్ర కుంకుమ పూజ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. లోకుమూడి దత్తాశ్రమంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా అన్నపూర్ణాదేవి అలంకరణ ఆకట్టుకుంది. మహిళలు కుంకుమార్చన చేశారు.

తటివర్రురోడ్డులో..

గుడివాడరూరల్: తటివర్రురోడ్డులో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల్లో అమ్మవారు సోమవారం శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు బేతంశెట్టి వెంకటరవికుమార్, ప్రసాద్,ఈశ్వర్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావుల పాల్గొన్నారు. చిన ఎరుకపాడులోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ కాశీఅన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం శ్రీఅమతేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరీదేవిగా అమ్మవారిని సోమవారం అలంకరించారు. పెదపాలపర్రులో అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా కరెన్సీ నోట్లతో అలంకరించారు. పెయ్యేరు కనకదుర్గ, గురజ, పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు పలు రూపాల్లో దర్శనమిచ్చారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని మండవల్లి, కానుకొల్లు, అయ్యవారిరుద్రవరం, పెరికెగూడెం, లింగాల, భైరవపట్నం గ్రామాల్లో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారు శ్రీ లలితాదేవిగా దర్శనమిచ్చారు. అర్చకుడు గూడూరు నాగవెంకటశాస్త్రి భక్తులతో పూజలు జరిపించారు.

శ్రీ అన్నపూర్ణా దేవిగా..

గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్డులోని శ్రీ విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవిగా, బంటుమిల్లి రోడ్‌లోని భీమేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా, గౌరీశంకర స్వామి ఆలయంలో శ్రీ గాయత్రీ దేవిగా అమ్మవార్లను అలంకరించారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక బుచ్చమ్మతల్లి ఆలయంలోని పర్వత వర్ధనీ దేవిని మంగళగౌరిగా అలంకరించి పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని సంతానలక్ష్మిగా అలంకరించారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనభాగ్యం కల్పించారు. కొండిపర్రు గ్రా మంలో భ్రమరాంబ దేవిని ధనలక్ష్మిగా అలంకరించారు.



కైకలూరు మండలం లోకుమూడిగరువు దత్తాశ్రమంలో అన్నపూర్ణాదేవి అలంకరణ

పెదపారుపూడిలో..

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల గ్రామంలోని శ్రీరామలింగేశ్వస్వామి ఆలయంలోని పార్వతి అమ్మవారు శరన్నవరాత్రులు పురస్కరించుకుని భక్తులకు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు చింతాబరం అమ్మవార్లకి ప్రత్యేక పూజలు చేశారు.

కాత్యాయినీ దేవిగా కొండలమ్మ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి కాత్యాయినీ దేవిగా సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆలయ పండితుల వేద మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక హోమాలను చేపట్టారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే నవరాత్రుల్లో పురస్కరించుకుని దోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు సోమవారం శ్రీ సంతాన లక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన్ను ఈఓ కొండలరావు సన్మానించారు. మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గుడివాడ విజయదుర్గ దేవస్థానంలో శ్రీ అన్నపూర్ణాదేవిగా..



సింగరాయపాలెం అమతేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవిగా..



వానపాములలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు



కాత్యాయినీ దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ



దోకిపర్రులో సంతాన లక్ష్మీదేవిగా అమ్మవారు

దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్న ఆయుష్ వ్యవస్థ

గుడివాడ టౌన్: భారతదేశంలో, ప్రపంచ వ్యాప్తంగా ఆయుష్ వ్యవస్థ విస్తరిస్తుందని హోమియో రీజినల్ రీసెర్చ్ సెంటర్(ఆర్ఆర్ఐ) ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ కిషన్ బానోత్ అన్నారు. స్థానిక ఆర్ఆర్ఐ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి, భారత్ ఆయుష్ మంత్రిత్వ శాఖ అనేక కొత్త వైద్యవిధానాలను కనుగొని రోగులకు స్వస్థతనిస్తూ సేవలు కొనసాగిస్తుందన్నారు. వీటికి తోడు గుడివాడ గురరాజు హోమియో వైద్య కళాశాలకు అదనంగా మూడు విభాగాలకు చెందిన 24 మంది విద్యార్థులు పీజీ కోర్సు చేసేందుకు అనుమతులు వచ్చాయన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రమాదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, ఆర్ఆర్ఐ పరిశోధనాధికారి డాక్టర్ బి.రాజశేఖర్ పాల్గొన్నారు.

పామర్రు డ్రెయిన్ తవ్వకాలు చేపట్టాలి

పామర్రు: పామర్రు డ్రెయిన్‌లోని ఆక్రమణలను తొలగించి, తవ్వకాలు చేపట్టాలని బాధితులు మంచాల మరియకుమారి, అడపా రాజ్యలక్ష్మి, పోతన వాణి, బాలినేని శివరంజని సోమవారం విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ప్రజావేదికలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని పేర్కొన్నారు. డ్రెయిన్ నీరు పొంగి పక్కనే ఉన్న నివాసాల్లోకి నీరు చేరుతోందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com